జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435


PUBLISH IN HYDERABADH | సంపుటి : 01 సంచిక : 209 | SANDESHAM TIMES | గురువారం 25 - 12 - 2025 | SANDESHAM TIMES TELUGU DAILY

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ఏపీలో క్వాంటం కోర్సులు

**ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ**

- యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు
- పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఆదేశం
- ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- 50 వేల మంది టెక్ విద్యార్థులకు క్వాంటం నైపుణ్యాలపై శిక్షణకు లక్ష్యం
- 2026 జనవరిలో స్టూడెంట్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహణకు నిర్ణయం



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రాష్ట్ర యువతకు భవిష్యత్ సాంకేతికతలో నైపుణ్యాలు అందించేందుకు క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఇందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించేలా దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రతిపాదనలను సీఎంకు వివరించారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు

మిగతాది 2 లో...



## అర్ధరాత్రి వరకు వైన్స్

**నూతన సంవత్సర వేడుకల కోసం ప్రభుత్వం మద్యం విక్రయాల సమయాన్ని పొడిగిస్తూ**

- డిసెంబర్ 31న వైన్ షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు..
- బార్లు, క్లబ్‌లు, ఈవెంట్లకు ఒంటి గంట వరకు
- వేడుకల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు ప్రత్యేక డాగ్ స్క్వాడ్స్, అత్యాధునిక టెస్టింగ్ కిట్‌లను సిద్ధం

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** తెలంగాణలో నూతన సంవత్సర వేడుకల కోసం ప్రభుత్వం మద్యం విక్రయాల సమయాన్ని పొడిగిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 31న వైన్ షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు.. బార్లు, క్లబ్‌లు, ఈవెంట్లకు ఒంటి గంట (1 %ూవీ%) వరకు అనుమతినిచ్చారు. వేడుకల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్, పోలీస్ శాఖలు హెచ్చరించాయి. డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు ప్రత్యేక డాగ్ స్క్వాడ్స్, అత్యాధునిక టెస్టింగ్ కిట్‌లను సిద్ధం చేశారు. నగరం అంతటా భారీగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని, వాహనదారులు ముందుగానే డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. తెలంగాణలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2025 ముగిసిన.. 2026లోకి అడుగుపెట్టే తరుణంలో

మిగతాది 2 లో...

## కూటమి చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆర్బీఐ డేటా చెబుతోంది

**తమ పాలనపై టీడీపీ-జనసేన అబద్ధాలు చెబుతోందన్న జగన్**

- ఆర్బీఐ లెక్కల ప్రకారం పారిశ్రామిక వృద్ధిలో ఏపీ అగ్రస్థానంలో ఉందని వెల్లడి
- పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన అంబటి రాంబాబు
- మెడికల్ కాలేజీల స్కామ్ భయంతోనే పవన్ వ్యాఖ్యలని ఆరోపణ



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ఐదేళ్ల పాలనలో (2019–24) పారిశ్రామిక రంగంలో రాష్ట్ర పనితీరుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన గణాంకాలతో, కూటమి నేతల అబద్ధాలు బట్టబయలయ్యాయని తెలిపారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన జగన్, వైసీపీ ప్రభుత్వం 'బ్రాండ్ ఏపీ'ని నాశనం చేసిందని, పెట్టుబడిదారులను తరిమేసిందని టీడీపీ-జనసేన నిరంతరం ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ ఆరోపణల్లో కొంచెమైనా నిజం ఉండి ఉంటే పారిశ్రామిక రంగంలో ఏపీ పనితీరు దారుణంగా ఉండేదని, కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఆర్బీఐ లెక్కల ప్రకారం 2019–24 మధ్య తయారీ

మిగతాది 2 లో...

## కొత్త ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లెవెలుగు' అయినా సరే ఏసీ ఉండాలి

- పల్లెవెలుగుతో సహా కొత్త ఈవీ బస్సులన్నీ ఏసీవే ఉండాలని సీఎం ఆదేశం
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1,450 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు నిర్ణయం
- ఐదేళ్లలో 8,819 డీజిల్ బస్సుల స్థానంలో కొత్త ఈవీ బస్సులు
- గోదావరి పుష్కరాల కోసం జిల్లాల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సూచన

**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** ఏపీఎస్ఆర్టీసీలో ఇకపై కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లెవెలుగు'కు చెందినవైనా తప్పనిసరిగా ఏసీవే అయ్యుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఈవీనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కొత్త ఎలక్ట్రిక్ బస్సు తప్పనిసరిగా ఏసీ సౌకర్యంతో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే 'పల్లెవెలుగు' బస్సులకు



## నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యి రేవంత్

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవోలను దాచిపెడుతోందని హరీశ్ రావు**

- 13 నెలల కాలంలో 82 శాతం జీవోలను రహస్యంగా ఉంచారని విమర్శ
- జీవోల గోప్యతపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్య
- చీకటి జీవోల మాటున ఏం చేస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) ప్రజలకు అందుబాటులో ఉంచకుండా దాచిపెడుతోందని బీఆర్ఎస్

మిగతాది 2 లో...



## ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం!

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు**

- సిట్ నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్రమంత్రి బండి సంజయ్
- ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపణ
- టీవీ సీరియల్స్ పూర్తయ్యాయి, కానీ కేసు తేలలేదన్న విమర్శ
- విచారణ అధికారులకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ

# కూటమి చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆర్బీఐ డేటా చెబుతోంది

రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలో ప్రథమ స్థానంలో, దేశంలో ఐదో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అలాగే, పారిశ్రామిక వృద్ధిలో కూడా దక్షిణాన మొదటి స్థానంలో, దేశవ్యాప్తంగా 8వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. "ఇది బ్రాండ్ ఏపీని నాశనం చేయడమా? లేక పరివర్తనాత్మక నాయకత్వంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమా?" అని జగన్ ప్రశ్నించారు.

**పవన్ రౌడీ భాష మాట్లాడుతున్నారు: అంబటి రాంబాబు**

ఇదిలా ఉండగా, వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ ప్రసంగాలు దూకుడుగా, గందరగోళంగా ఉంటున్నాయని, ఆయన మాటలు ఆయనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పవన్ రౌడీ భాష మాట్లాడటం తగదని హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ స్కామ్‌పై భయంతోనే పవన్ తమ పార్టీపై విమర్శలు చేస్తున్నారని అంబటి ఆరోపించారు. చంద్రబాబు ఈ కాలేజీలను తన అనుచరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఈ వ్యవహారంలో పవన్‌కు కూడా వాటా ఉందేమోనన్న అనుమానం కలుగుతోందని ఆయన అన్నారు.

# కొత్త ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లెవెలుగు' అయినా సరే ఏసీ ఉండాలి

కూడా ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిక్ బస్సుల రోడ్‌మ్యాప్‌పై మంగళవారం నాడు సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1,450 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రాబోయే ఐదేళ్లలో మొత్తం 8,819 డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే ప్రణాళికకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. 8 ఏళ్లకు పైబడిన పాత బస్సులను కూడా ఈవీలుగా మార్చాలని నిర్దేశించారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, గోదావరి జిల్లాల్లో ముందుగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. ఇందుకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పథకం వల్ల పెరిగిన ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు కొత్త బస్సులు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# గుడివాడ అభివృద్ధి పనుల్లో దైవ సహాయం ఉండాలి: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ డిసెంబర్ 23 సందేశం టైమ్స్** కూటమి ప్రభుత్వంలో నిరంతరం కొనసాగుతున్న గుడివాడ అభివృద్ధి పనులు ఆటంకాలు లేకుండా ముందుకు సాగేలా దైవ సహాయం ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. గుడివాడ లో వస్తున్న మార్పులను క్రిస్మస్ వేడుకల్లో దైవ సేవకులతో కలిసి పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ వి కే ఆర్ %ఁ% వి ఎన్ బి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము – సుఖద దంపతుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం మధ్యాహ్నం ఘనంగా జరిగాయి. వేడుకల్లో నియోజకవర్గ పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో దైవ సేవకులు, క్రైస్తవ సంఘాల పెద్దలు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న విశ్వాసులు మరియు సంఘ పెద్దలతో ఎమ్మెల్యే రాము ఆప్యాయంగా మాట్లాడారు. వేడుకల్లో భాగంగా జరిగిన సభలో పలువురు దైవ సేవకులు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బైబిల్ లోని ముఖ్య అంశాలను ప్రస్తావిస్తూ, క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ బైబిల్ లో ఉన్న మంచి వాక్యాలను మనందరం ఆచరించాలన్నారు. క్రీస్తు దేవుడు ఆశీస్సులు, దైవ సేవకుల సహకారంతో గుడివాడలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేస్తున్నానన్నారు. నాకోసం ప్రార్థన చేస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గం బాగుపడాలి, ప్రజల జీవితాలు మారాలని నా కష్టమంతా అని ఆయన అన్నారు. క్రిస్టియానిటీ అనేది ఒక జీవన మార్గమని, సమాజంలో ఎలా బతకాలో అనేక సందర్భాల్లో బైబిల్ లో మాటలు ఉన్నాయన్నారు. దైవ సేవకులు అంటే సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన వ్యక్తులని, దురాచారాన్ని అరికడుతూ, మత్తులో జోగుతున్న యువతను సన్మార్గంలో పెట్టాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసే దిశగా ముందుకు సాగుతున్నాను అన్నారు. ముఖ్యంగా గుడివాడలో ప్రధాన సమస్యల్లో ఒకటైన క్రైస్తవ స్మశాన వాటిక ఆవశ్యకతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని ఆ సమస్యను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. గౌరవ వేతనం అందరిని పాస్టర్లు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రతి ఒక్కరికి వేతనం అందించే బాధ్యత నాదని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. క్రైస్తవ విశ్వాసులందరూ క్రిస్టమస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని, ప్రతి ఏటా ఇదే విధంగా అందరం కలిసి సెమి క్రిస్టమస్ వేడుకలు నిర్వహించుకుందామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అనంతరం దైవ సేవకులు, కూటమి నేతలతో కలిసి క్యాండిల్ సర్వ్ చేసిన ఎమ్మెల్యే రాము – సుఖద దంపతులు, క్రిస్మస్ కేక్ కట్ చేసి, విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సెమీ క్రిస్మస్ వేడుకల్లో స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వ రవి కుమార్, నందివాడ మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు డాక్టర్ గోర్జీ సత్యనారాయణ, చేకూరుబిజగన్మోహన్ రావు, కంచర్ల సుధాకర్, పంద్రాజు సాంబశివరావు, కొడాలి రామరాజు, యేసుపాదం,మెరుగు మోజెస్, కనకాంబరావు, దాసే శ్యామ్, సాల్మన్ రాజ్, గద్దం ప్రకాష్ దాస్, గోకవరపు సునీల్, నిమ్మగడ్డ సత్యసాయి, ఇమాన్యుయల్, సాల్మన్ రాజు, మరీదు కరుణ కుమారి, ప్రశాంతి, జయశ్రీ, మెటోరా, డేవిడ్, ప్రియానాధుడు, నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లు, క్రైస్తవ సంఘాల పెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఏపీలో క్వాంటం కోర్సులు



దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు తమ యాక్షన్ ప్లాన్‌ను సమర్పించారు. ఈ ప్రతిపాదనలను సమీక్షించిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి క్వాంటం టెక్నాలజీపై అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. "ప్రైవేట్ పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా 7, 8, 9 తరగతుల విద్యార్థులకు క్వాంటం టెక్నాలజీపై అవగాహన కల్పించాలి. ఇందుకోసం అవసరమైన కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి" అని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 2026 జనవరి నెలాఖరు నాటికి క్వాంటం టెక్నాలజీలో నైపుణ్యాలు అందించేలా పాఠ్యాంశాలను సిద్ధం చేయాలన్నారు. సుమారు 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులకు ఈ నూతన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నేషనల్ ప్రొగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్' (%చీూజుూ%) వేదికను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 2026 జనవరి నెలాఖరులో 'స్టూడెంట్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్' నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఈ సదస్సులో విద్యార్థులు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. ఇదే సమావేశంలో రాష్ట్రంలో ట్రూ 5జీ సేవల విస్తరణపై బీఎస్ఎన్ఎల్ అధికారులతో కూడా సీఎం సమీక్షించారు. ఈ భేటీలో విద్యాశాఖ ఉన్నతాధికారులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నువ్వు దొంగచాటుగా ఏం చేస్తున్నావో బహిర్గతం చెయ్యి రేవంత్



సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాల్లోగా బహిర్గతం చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు... ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కార్‌కు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. ఈ విషయంపై హరీశ్ రావు స్పందిస్తూ.. "ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, జీవోలను దాచిపెడుతూ పెద్ద డ్రామా ఆడుతోంది. మా పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ సమాచార హక్కు చట్టం (%ఆ×%) ద్వారా సేకరించిన సమాచారంతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (%ూ×ూ%) దాఖలు చేశారు. దీంతో ప్రభుత్వ అసలు రంగు బయటపడబోతోంది" అని తెలిపారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 26 వరకు మొత్తం 13 నెలల కాలంలో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేయగా, వాటిలో కేవలం 3,290 మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. "ఏకంగా 15,774 జీవోలను, అంటే 82 శాతం జీవోలను ఎందుకు దాచిపెడుతున్నారు? చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నారు? రేవంత్ రెడ్డి, ఇదేనా మీరు చెప్పిన ప్రజా ప్రభుత్వం?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే జీవోలన్నింటినీ బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం!

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఈ నిర్ణయంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, దీనిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనతో పాటు ఎందరో నేతల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, కుటుంబాల్లో చిచ్చు పెట్టారని విమర్శించారు. "కన్నబిడ్డ, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేయించి, ఎంతో పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారు" అని మండిపడ్డారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టర్లు, నేతల నుంచి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే, ఈ విచారణపై ఆయన పలు సందేహాలు వ్యక్తం చేశారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా, లేక దోషులను తేలుస్తారా అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసు మొదలైనప్పుడు ప్రారంభమైన టీవీ సీరియళ్లు కూడా పూర్తయ్యాయి కానీ, ఈ కేసు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది" అని ఎద్దేవా చేశారు. విచారణ అధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, ఈ కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను బయటపెట్టాలని ఆయన కోరారు.



# అర్ధరాత్రి వరకు వైన్స్



నిర్వహించే వేడుకల కోసం మద్యం విక్రయాల సమయాన్ని పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని.. అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 31వ తేదీన వేడుకల రద్దీని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సమయాలను కేటాయించింది. సాధారణంగా రాత్రి 10 గంటలకే మూతపడే వైన్ షాపులకు.. డిసెంబర్ 31న రాత్రి 12 గంటల వరకు విక్రయాలు జరుపుకునేందుకు అనుమతి ఇచ్చారు. బార్ అండ్ రెస్టారెంట్లు, క్లబ్‌లు, పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లకు అర్ధరాత్రి ఒంటి గంట (1 %ూవీ%) వరకు మద్యం సరఫరా చేసేందుకు వీలు కల్పించారు. అనుమతి పొందిన న్యూ ఇయర్ ఈవెంట్లకు కూడా అర్ధరాత్రి ఒంటి గంట వరకు సమయం కేటాయించారు. వేడుకల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం హెచ్చరించింది. పబ్బులు, బార్లలో డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు ప్రత్యేక డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించుతున్నారు. నిమిషాల్లోనే ఫలితాలను ఇచ్చే అత్యాధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్‌లను పోలీసులు సిద్ధం చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో డిసెంబర్ 31 రాత్రి భారీగా తనిఖీలు ఉంటాయి. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తారు. వాహనదారులు ముందుగానే డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుండి వచ్చే డ్యూటీ పెయిడ్ కాని మద్యంపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. నాటుసార, గంజాయి విక్రయాలపై స్పెషల్ టీమ్‌లు దాడులు నిర్వహించనున్నాయి. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు ప్రభుత్వం కొన్ని కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కేవలం మద్యం విక్రయాలే కాకుండా.. ఈవెంట్ల నిర్వహణలో ధ్వని కాలుష్యంపై కూడా ఆంక్షలు ఉంటాయి. ఈవెంట్లలో వినియోగించే సౌండ్ సిస్టమ్స్ నిర్ణీత డెసిబుల్స్ పరిమితికి లోబడి ఉండాలి. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ భారీ శబ్దాలతో సంగీతాన్ని ప్లే చేయకూడదు. నివాస ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించే వారు పొరుగువారికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని పోలీసులు కోరారు.



# బిఆర్ఎస్ నాయకుల ను సన్మానించిన మాజీ మంత్రి హరీష్ రావు




**సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి డిసెంబర్ 24** కౌడిపల్లి మండలం లింగంపల్లికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులను బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఘనంగా పరామర్శించారు. లింగంపల్లి కి చెందిన సుధాకర్, బిచ్చం, బలరాం, తోపాటు పలువురు బిఆర్ఎస్ నాయకులను సన్మానించారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి సర్పంచిగా పోటీ చేసి ఓడిపోవడంతో నిరుత్సాహపడకుండా ముందుకు వెళ్లాలని హరీష్ రావు ఓదార్చి సన్మానించారు. కలిసికట్టుగా పనిచేసి జరగబోయే ఎన్నికల్లో పాల్గొని టిఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ప్రతి కార్యకర్త సంకల్పంతో పనిచేసి ముందుకు వెళ్లినప్పుడే అనుకున్నది సాధిస్తామన్నారు. నర్సాపూర్ లో ఓ ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు.

# కష్టపడే కార్మికులకు కాస్మోటిక్స్ పంపిణీ చేసిన : ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 24డిసెంబర్ సంగారెడ్డి జిల్లా** నారాయణఖేడ్ పట్టణము లో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ కాస్మోటిక్స్ సామాగ్రిని పంపిణీ చేశారు సబ్బులు సరుపులు బెల్లం తదితర సామాగ్రిని కార్మికులకు కమిషనర్ పంపిణీ చేయడం జరిగిందని.అనంతరం మాట్లాడుతూ...శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ప్రతి సంవత్సరం పండుగలు సందర్భంగా మున్సిపల్ కార్మికులకు కాస్మోటింగ్ సామాగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కార్మికులు పారిశుద్ధ్య పనులు చేస్తారు కాబట్టి వారికి కాస్ఫోటిక్ వస్తువులు సామాగ్రిని తప్పకుండా అందించవలసిన బాధ్యత మున్సిపల్ కమిషనర్ పై ఉంటుందని అందుకోసం కాస్మోటిక్స్ సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

# మర్వెల్లీలో చర్చి అలంకరణ క్రిస్టమస్ వేడుకలు



**సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి( డిసెంబర్ 24)** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం వట్టిపల్లి మండల్ మర్వెల్లి గ్రామంలోని సి ఎస్ ఐ చర్చ్ క్రిస్టమస్ పండుగ సందర్భంగా స్టార్లతో మరియు లైటింగ్ తో చర్చిలోని యువకులు డెకరేషన్ తో ఏసుక్రీస్తు పుట్టిన సందర్భంగా చర్చి అలంకరించడం జరిగింది

# ఘనంగా న్యూ బోధి స్కూల్లో క్రిస్టమస్ వేడుకలు...





**సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి( డిసెంబర్ 24)** సంగారెడ్డి జిల్లా పట్టణ కేంద్రంలోని న్యూ బోధి స్కూల్లో విద్యార్థులు క్రిస్టమస్ సెలబ్రేషన్ ను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధానాల్లో మరియు క్రిస్మస్ పండగను విద్యార్థులందరూ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూ బోది స్కూల్ ప్రిన్సిపాల్ లింగం సార్ కరస్పాండెంట్ రవికుమార్ , టీచర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి ఎస్‌జీ ఎఫ్ హాకీ పోటీలకు ఈ తక్షిల పాఠశాల విద్యార్థులు ఎంపిక



**సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 24** ఉమ్మడి మెదక్ జిల్లా హాకీ ఎస్‌జీ ఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మైదానంలో అండర్-14 బాలబాలికల హాకీ జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంపికల్లో నారాయణఖేడ్‌లోని ఈ తక్షిల పాఠశాలకు చెందిన విద్యార్థులు లాస్య రెడ్డి, లలితాంబిక, మేరీ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్ తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు వనపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీ ఎఫ్ హాకీ పోటీల్లో వారు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను, అలాగే పీఈటీ శ్రీనాథ్‌ను అభినందిచారు

# సంస్కరణల పితామహుడికి ఘన నివాళి



**( పీవీ ఘాట్ వద్ద 21వ వర్ధంతి కార్యక్రమం) సందేశం టైమ్స్, హైదరాబాద్:** భారత మాజీ ప్రధాని, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు 21వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద ఘన నివాళులు అర్పించారు. దేశ గతిని మార్చిన సంస్కరణల పితామహుడికి ఆయన కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానులు భక్తిశ్రద్ధలతో అంజలి ఘటించారు. ఆయనొక కర్మయోగి – స్థితప్రజ్ఞుడు: పీవీ ప్రభాకర్ రావు ఈ సందర్భంగా పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ తన తండ్రి సేవలను స్మరించుకున్నారు. పీవీ నరసింహారావు వారసత్వం కేవలం ఆయన అమలు చేసిన చారిత్రక ఆర్థిక సంస్కరణలకే పరిమితం కాదని, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో విశాలమైనదని స్పష్టం చేశారు. లోతైన మేధస్సు, అంతర్గత శాంతి, అపార సహనంతో దేశాన్ని క్లిష్ట సమయంలో కీలక మలుపు తిప్పిన మహానాయకుడిగా ఆయనను అభివర్ణించారు. పీవీని ఒక 'కర్మయోగి'గా, 'స్థితప్రజ్ఞుడు'గా ప్రభాకర్ రావు కొనియాడారు.

**నవోదయ నుంచి అణుశక్తి వరకు..** పీవీ బహుముఖ ప్రజ్ఞను గుర్తుచేస్తూ, భూ సంస్కరణలు, విద్యా సంస్కరణల ప్రగతిలో ఆయన పాత్ర కీలకమని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నవోదయ విద్యాలయాలను విస్తరించడం ద్వారా జ్ఞాన సాధికారతకు బాటలు వేశారని అన్నారు. సామాజిక సమానత్వమే దేశ దీర్ఘకాలిక అభివృద్ధికి మూలాధారమని పీవీ నమ్మేవారని గుర్తుచేశారు. అలాగే, విదేశాంగ విధానంలో పీవీ దూరదృష్టిని ప్రస్తావిస్తూ.. 'లుక్ ఈస్ట్ పాలసీ' ద్వారా దక్షిణాసియా దేశాలతో సంబంధాలను మెరుగుపరిచారని, ఇది భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను బలోపేతం చేసిందని తెలిపారు. అణు శక్తి, క్షిపణి సాంకేతికతలో నేడు భారత్ సాధించిన పురోగతికి పీవీ నిశ్శబ్దంగా తీసుకున్న దృఢమైన నిర్ణయలే పునాది అని, ఇవే జాతీయ భద్రతకు, సాంకేతిక స్వావలంబనకు మార్గం వేశాయని పేర్కొన్నారు.

**హాజరైన ప్రముఖులు** ఈ స్మారక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్. వేణుగోపాల్ రావు, ఎస్. రాజయ్య, బీజేపీ చీఫ్ మీడియా ప్రతినిధి ఎన్.వి. సుభాష్, సీనియర్ జర్నలిస్ట్ మరియు తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) అధ్యక్షుడు డా. జితేందర్ రావు తనుగుల పాల్గొన్నారు. అలాగే పీవీ కుటుంబ సభ్యులు పీవీ శరత్, పి. సుశీల్ కుమార్, పీవీ మాధన్ మోహన్, పీవీ కిరణ్, ఎం. హరిబాబు, ఉదయ్ నాగరాజు తదితరులు హాజరై నివాళులు అర్పించారు. దేశ ప్రజాస్వామ్య, అభివృద్ధి ప్రయాణాన్ని మలిచిన దార్శనికుడు, సంయమనంతో కూడిన సంస్కరణవాది అయిన పీవీ నరసింహారావు సేవలను సభలో పాల్గొన్నవారంతా గంభీరంగా స్మరించుకున్నారు.

# డిజిటల్ న్యాయ వ్యవస్థతో వినియోగదారుల కేసులకు సత్వర పరిష్కారం

## జాతీయ వినియోగదారుల దినోత్సవంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు





**సూర్యాపేట, 24 డిసెంబర్ 2025 (సందేశం టైమ్స్):** డిజిటల్ న్యాయ వ్యవస్థను వినియోగించి వినియోగదారుల కేసులను త్వరితగతిన, సమర్థవంతంగా పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల రక్షణ చట్టం 1986లో అమల్లోకి వచ్చిందని, ఈ చట్టం ద్వారా వినియోగదారుడు వస్తువులు లేదా సేవల్లో మోసపోయినట్లయితే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి పరిహారం పొందవచ్చని తెలిపారు. వినియోగదారులు మార్కెట్లో కొనుగోళ్లు చేసే సమయంలో తగిన అవగాహన కలిగి ఉండాలని, వ్యాపారులు లాభార్జన కోసం తప్పుడు ప్రకటనలు, ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటిస్తారని వాటిని నమ్మి అత్యాశకు పోయి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం డిజిటల్, ఆన్‌లైన్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. మోసపోయిన వినియోగదారులు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి సత్వర న్యాయం పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా డీసీఐసీ కమిషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వినియోగదారులు నేరుగా వినియోగదారుల ఫోరంలో కేసులు దాఖలు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం%-%2019 ప్రకారం నిర్ణీత కాల పరిమితిలో కేసు ఫైల్ చేస్తే తప్పనిసరిగా న్యాయం లభించి నష్టపరిహారం ఇప్పించగలమని చెప్పారు. జిల్లా పౌరసర ఫరాల అధికారి మోహన్ బాబు మాట్లాడుతూ, ఈ చట్టంపై వినియోగదారుల సంఘాలు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులకు హక్కులతో పాటు ప్రశ్నించే తత్వం కూడా పెరగాలని, డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటిస్తూ మోసాలకు గురికాకుండా డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, సివిల్ సప్లై మేనేజర్ రాము, డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్, కమిషన్ సభ్యులు ప్రేమ్ సాగర్, గ్యాస్ డీలర్లు, రేషన్ షాప్ డీలర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ప్రజ్ఞ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**గన్నవరం సందేశం టైమ్స్** గన్నవరం శ్రీ ప్రజ్ఞ పాఠశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ సూరి పవన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో మనం కలిసి మెలసి ఉండాలని... నిన్ను నీవు ప్రేమించుకున్నట్టు నీ పొరుగు వారిని అలాగే ప్రేమించాలని.. క్రీస్తు జీవితం ద్వారా ప్రేమ, క్షమాపణ, దయా గుణం, సత్య వాక్కు వంటి మంచి లక్షణాలను మనం నేర్చుకోవాలని చెప్పారు. అదే విధంగా విద్యార్థులు కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని అందరని ఆకట్టుకున్నారు. ఆ తర్వాత విద్యార్థులందరూ ఒకరికొకరు క్రిస్మస్ బహుమతులు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగ శైలజ రాజరాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ డిసెంబర్ 24 సందేశం టైమ్స్** క్రైస్తవ సోదర సోదరీమణులకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లలులేని సంతోషాలను బహూకరించే ఉత్సవం క్రిస్మస్ అని పేర్కొన్న ఎమ్మెల్యే రాము... ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజును ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అందరిపట్ల కృతజ్ఞత, ప్రేమను కలిగి ఉండటం, తోటి వారితో సంతోషాలను పంచుకోవడమే క్రిస్మస్ అన్నారు. లోక రక్షకుడు, కరుణామయుడు అయిన క్రీస్తు బోధనలు ప్రతిఒక్కరికి మార్గదర్శకమని..... అందరూ సుఖ, సంతోషాలతో ఉండాలన్నదే ఏసుక్రీస్తు బోధనల సారాంశం అన్నారు. ప్రేమ, శాంతి ద్వారా ఏదైనా సాధించవచ్చన్న, ఏసుక్రీస్తు బోధనలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలనీ ఎమ్మెల్యే రాము సూచించారు. సర్వజనులపై క్రీస్తు దేవుని కరుణాకటాక్షాలు ఉండాలని ప్రార్థించిన ఎమ్మెల్యే రాము.... విశ్వాసులందరికీ హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు.

# ఆటో డ్రైవర్ హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్..



**తాడేపల్లి సందేశం టైమ్స్** పాత కక్షల నేపథ్యంలో తాడేపల్లి మండలం మదర్ థెరిసా కాలనీ సమీపంలోని అంజిరెడ్డి కాలనీ –కొలను కొండ బైపాస్ మార్గంలోని అరటి తోటలో ఈనెల 18వ తేదీ రాత్రి జరిగిన ఆటో డ్రైవర్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ వీరేంద్రబాబు తో కలసి కేసు వివరాలను వెల్లడించారు. తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం చెందిన ఇల్లచెరువు వెంకటరావు (32) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీ రాత్రి వెంకటరావు తన ఆటోలో మదర్ థెరిసా కాలనీ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో అంజిరెడ్డి కాలనీకి చెందిన మల్లినేని సాయి భవాని అలియాస్ సాయి తన జన్మదినోత్సవం సందర్భంగా స్నేహితులైన వేమూరి మహేష్ బాబు అలియాస్ మహి, ఎన్టీఆర్ కట్టకు చెందిన నీరజ్, గితీష్, ఆదిత్య, నవదీప్ జోసఫ్ లతో రోడ్డు పక్కన బర్త్ డే పార్టీ చేసుకుంటుండగా ఆటో డ్రైవర్ వెంకటరావు తన ఆటోతో తో కట్ కొట్టి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. ఈ క్రమంలో స్నేహితులంతా బిగ్గరగా అరచి ఆటో డ్రైవర్ వెంకటరావును ఆపే ప్రయత్నం చేయగా ఆటోలో వేగంగా వెళ్ళిపోయాడు. దీంతో మల్లినేని సాయి భవాని, వేమూరి మహేష్ బాబు లు తమ ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆటోను అడ్డగించి ఆటో డ్రైవర్ వెంకటరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో వెంకటరావు వారి నుండి తప్పించుకొని సమీపంలోని అరటి తోటలోకి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో తారు రోడ్డుపై రాళ్లగుట్టపై పడవేసి ఉన్న దుప్పట్లో రెండు పెద్ద సిమెంటు రాళ్లు తీసుకువచ్చి వెంకటరావు తలపై మోది హత్య చేసి పరారయ్యారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ పర్యవేక్షణలో తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, ఎస్సైలు షేక్ ఖాజావలి, ప్రదీప్ వారి సిబ్బంది తో బుధవారం నిందితులను బ్రహ్మానందపురం వద్ద అరెస్టు చేశారు. కాగా హత్య కేసును రోజుల వ్యవధిలో ఛేదించిన తాడేపల్లి పోలీస్ అధికారులను, సిబ్బందిని డిఎస్పి మురళీకృష్ణ అభినందించి రివార్డులను అందజేశారు...

# ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శ జీవనానికి మార్గం : ఎంపీ కేశినేని శివనాథ్





- విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు..
- క్రిస్మస్ కేక్ కట్ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్
- ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ క్రిస్మస్ శుభాకాంక్షలు

**విజయవాడ సందేశం టైమ్స్** ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శ జీవనానికి మార్గమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాయలం ఎన్టీఆర్ భవన్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ , క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని కేక్ కట్ చేసి.. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మత పెద్దలు ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రపంచానికి ప్రేమ, శాంతి ,సేవ అనే విలువలను అందించిన ఏసుక్రీస్తు నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్నారు. ప్రపంచంలో జరిగే అతిపెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. క్రీస్తు బోధనలు, ఆయన చూపి బాటను అంతా అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఉర్ల మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు గొర్రి శ్రీనివాస చక్రవర్తి, టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళిత రత్న), స్టేట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బుద్దకోళ్ల ప్రేమరాజు, మరనాత విశ్వాస సమాజం పాస్టర్ విశ్వప్రసాద్, పాస్టర్ డెవిడ్ బ్రెన్ హెూమ్, గ్రేస్ మినిస్ట్రీయస్ బిషప్ ఎలిషా, వన్ టౌన్ పాస్టర్ పెలోషిఫ్ అధ్యక్షుడు మ్యాథ్యూస్, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ నాయకుడు ఇత్తడి చార్లెస్, చాట్ల రాజశేఖర్, సంకె విశ్వనాథం, మాదిగాని గురునాథం, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కన్నీటి వేళ అండగా, బాధలో భరోసాగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





**గన్నవరం :** ప్రజల కష్టాల్లో భరోసాగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు బుధవారం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో వరుస పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొని అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, విషాదంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రామవరప్పాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీమతి బొమ్మసాని అరుణ, మొవ్వ ఆంజనేయులు, మెండే అప్పారావులు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఇదే క్రమంలో గన్నవరం మండలం, గన్నవరం టౌన్‌లో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి తులిమెల్లి ఝాన్సీ మరియు వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గన్నవరం ఎస్సీ కాలనీ వాసులైన వి. రత్నాకరరావు ఇటీవల పరమపదించిన నేపథ్యంలో, స్థానిక అంబేద్కర్ పార్క్ సమీపంలోని వారి స్వగృహానికి వెళ్లి దివంగతుల చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్టసమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ వరుస పరామర్శల్లో తెలుగుదేశం పార్టీకి చిరకాలంగా సేవలందించిన ప్రముఖ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రామ్మోహనరావు మాతృమూర్తి, దివంగత శ్రీమతి కంభంపాటి వెంకట నరసమ్మ పరమపదించిన నేపథ్యంలో, ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లిన యార్లగడ్డ దివంగతుల చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీకి, సమాజానికి చేసిన సేవలను స్మరించుకుంటూ శోకసంతప్త కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన స్వర్గీయ యలమంచిలి బేబీ సరోజినీ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే కటారి రాము ఇటీవల పరమపదించిన నేపథ్యంలో వారి స్వగృహానికి వెళ్లి దుఃఖసంతప్తులైన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ అపార నష్టాన్ని భరించే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ప్రజలైనా, పార్టీ నాయకులైనా ఎవరి కష్టమైనా తనదిగా భావించి స్పందించడమే తన రాజకీయ జీవన విధానమని ఈ సందర్భంగా శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్రాణం హరిబాబు, గూడపాటి తులసిమోహన్, నబిగాని కొండయ్య, జాస్తి శ్రీధర్, మున్నా రామకృష్ణ, కొల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివరావు, కుందేటి చంద్రశేఖర్, కొండేటి వెంకటేశ్వరరావు, కలపాల కిరణ్, పట్టపు వెంకటేశ్వరరావు, కాసర్నేని రంగబాబు, బుస్సే నాగప్రసాద్, జొన్నలగడ్డ సుధాకర్, అన్నే హరికృష్ణ, షేక్ ఫిరోజ్, తిరువీధి నరేష్, సూరిబోయిన రాంబాబు, అలిగోజీ నాగబాబు, వంగా అయ్యప్పరెడ్డి, మోర్ల నాగబాబు, పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సోయగాల సంగమం - గండికోట జలాశయం

**పులివెందుల డిసెంబర్ 24 (సందేశం టైమ్స్):** కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని గండికోట జలాశయం చరిత్రకి ఎక్కనుంది. జిల్లాలోనే అతిపెద్ద జలాశయం. సాగునీటికి పెద్దదిక్కు మారింది. 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసేలా ఈ జలాశయాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టులో మూడు నదుల నీరు చేరుతుండటంతో 'త్రివేణి సంగమం' మారింది. పెన్నా, చిత్రావతి, కృష్ణా జలాల కలయికతో ప్రసిద్ధి పొందుతోంది. సాగునీటికి గుండెకాయగా మారడంతో పాటు, మత్స్యకారులకు కాసులు కురిపిస్తోంది. పర్యాటకంగానూ అనేక ప్రత్యేకతల సమాహారంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ప్రభుత్వం స్పందించి బ్యాక్ వాటర్లో పర్యాటకుల కోసం కేరళ తరహా విలాసవంతమైన పడవలు (అల్ట్రా లగ్జరీ బోట్లు) ఏర్పాటు చేయడానికి అనుకూలమైన విజన్ గా 2047లో భాగంగా జిల్లాను టూరిజం హబ్ గా మార్చడానికి అధికారులు వివిధ రకాల ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే గండికోట పర్యాటకంగా ప్రసిద్ధి పొందగా అందుకు అనుబంధంగా ఇంకా ఎలాంటి ఏర్పాట్లు చేయలన్న దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెండటంతో పాటు, ఉపాధి, ఆదాయ మార్గాలు పెంచడానికి పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. రెండు కొండల మధ్య నిర్మితమైన గండికోట ప్రాజెక్టు అందాలు పర్యాటకుల మనసును కట్టి పడేస్తున్నాయి. గండికోట సొరంగం ద్వారా కృష్ణా జలాలు ప్రాజెక్టు వైపు పరుగులిడే సమయంలో ఎన్నో అందాలు ఆకట్టుకుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్యోదయం, సూర్యస్తమయం అద్భుత సుందర దృశ్యాలు. కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని కొండాపురం గ్రామం శివారులో కనుచూపుమేర గండికోట వెనుక జలాలు కనిపిస్తుంటాయి. ఈ మార్గంలో రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా ప్రయాణం చేస్తే వారికి ఆ నీటి సవ్వడుల్లో ఎన్నెన్నో అందాలు కనువిందు చేస్తుంటాయి. గండికోట ప్రాజెక్టు నుంచి పెన్నాలోయ మీదుగా మైలవరం జలాశయం వరకు సుమారు 12 కిలోమీటర్లు దూరం బోటు షికారు ఏర్పాటు చేస్తే ప్రకృతి సౌందర్యాన్ని, ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. గండికోట వెనుక జలాల్లో సాయం సంధ్య వేళ భానుడి లేలేత కిరణాలు మధురానుభూతిని పంచుతాయి. ప్రాజెక్టు వద్ద పర్యాటకులు సేద తీరడానికి ఉద్యానవనం (పార్కు) తదితర వాటిని ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. చిత్రావతి, పెన్నా, కృష్ణా జలాలు కలుస్తుండటంతో ఇక్కడ ప్రత్యేక ఘాట్లు నిర్మిస్తే పుణ్య స్నానాలకు వచ్చే వారికి అనుకూలంగా ఉంటుంది. గండికోట, మైలవరం జలాశయాల్లో కేరళ త లగ్జరీ బోట్లలో విడిదిని ఏర్పాటు చేస్తే నీటి మధ్యనే రోజంతా ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు ఇక్కడ లభించే అరుదైన జల చరాలతో పర్యాటకుల ఆనంద పరవశాలకు కేంద్రబిందువు కానుందని చెప్పవచ్చు.

# నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్‌కు సన్మానం





**సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 24** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వేల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ వెండికోల్ భూమయ్యకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూరందయ్య స్వామి, ఒగ్గు కుమార్, పాండు కలిసి ఉప సర్పంచ్ భూమయ్యకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి దిశగా ఉప సర్పంచ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# మహాత్మా గాంధీ పేరును తొలగించడం దేశ ప్రజలకు అవమానం - కెవిపిఎస్



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 24డిసెంబర్** కేంద్ర బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి తీసుకొచ్చిన వీ బీజీ రామ్ జీ బిల్లును వెంటనే రద్దు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు డిమాండ్ చేశారు. ఈ బిల్లు కోట్లాది ఉపాధి కూలీల జీవన హక్కును దెబ్బతీస్తోందని, కొత్త పథకంలో పనికి హామీ లేకపోవడంతో పాటు నిధులపై స్పష్టత లేదని విమర్శించారు. గత 20 ఏళ్లుగా గ్రామీణ పేదలకు ఉపయోగపడిన ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి అమలు చేయాలని కోరారు.

# వరి నారులో నీటి నిర్వహణపై యువ రైతు అనుభవం

## యాసంగిలో తన సాగు పద్ధతిని పంచుకుంటున్న రైతు రమేష్




**వంగూర్ మండలం / తిరుమలగిరి, 24 డిసెంబర్ 2025 (సందేశం టైమ్స్):** యాసంగి సాగు కాలంలో వరి నారులో నీటి నిర్వహణ కీలకమని, తన అనుభవం ఆధారంగా యువ రైతు రమేష్ తెలిపారు. వంగూర్ మండలం తిరుమలగిరి గ్రామపంచాయతీ పరిధిలో వరి నారు వేసిన రమేష్, చలి తీవ్రత ఎక్కువగా ఉన్న రాత్రి సమయాల్లో నారులో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాత్రిపూట నీరు నిల్వ ఉండితే చలి ప్రభావం ఎక్కువగా ఉండి నారు బలహీనపడే అవకాశం ఉందని తన పరిశీలనలో గమనించానని రమేష్ తెలిపారు. నీటిని అవసరమైనంత మాత్రమే ఉంచడం వల్ల నారు ఆరోగ్యంగా ఎదుగుతూ వేర్లు బలపడుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విధానంతో తన పొలంలో చీడపీడలు, తెగుళ్ల సమస్యలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్న రమేష్, యాసంగి కాలంలో ప్రతి రైతు తన పొలం పరిస్థితిని బట్టి నీటి నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తన అనుభవాన్ని తోటి రైతులతో పంచుకుంటూ సాగు చేస్తున్న రమేష్, స్థానికంగా ఇతర రైతులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

# హస్తం గూటికి అన్నాసాగర్ సర్పంచ్ మల్లీశ్వరి



**సందేశం టైమ్స్ : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి24డిసెంబర్** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆందోల్ మండలం అన్నాసాగర్ గ్రామంలో స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన సింగూరి మల్లీశ్వరి ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సింగూరి మల్లీశ్వరి బుధవారం గ్రామ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని, సంగారెడ్డిలోని తన స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో నాయకులు, గ్రామస్తులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందిస్తూ మల్లీశ్వరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 'గ్రామ అభివృద్ధి కోసం సర్పంచులు ముందుండాలి. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి" అని మంత్రి అన్నారు. "కేంద్ర ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న నిధులను నేరుగా సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలనే అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం" అని తెలిపారు. "రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థాయికి తప్పకుండా చేరుస్తాం" అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times3-82, Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508206Gmail : sandeshamtimes@gmail.comWebsite: https://sandeshamtimes.comPublisher : MADDINENI NAGESWARA RAOAddress104, HILLS APARTMENT, Press (Name & Address)SUNDAY PRINTING PRESS3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH-522006